సాక్షి అనకాపల్లి

ఆదివారం । 4 । మే । 2025

ఉష్ణోగ్రతలు
శనివారం
గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి : 34.8/26.0



ఒక మెరుపు మెరిసినా.. ఒక ఉరుము ఉరిమినా ఉలిక్కిపడతాం.. కానీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో శనివారం సాయంత్రం నుంచి ఏకధాటిగా మెరుపులు జలదరించేలా చేశాయి.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 6,200 మెరుపులు మెరిసినట్లు వాతావరణ విభాగ నిపుణులు తెలిపారు.

– సాక్షి, విశాఖపట్నం

న్యూస్‌రీల్

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1,10,116 విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం కశింకోటకు చెందిన మళ్ల భాస్కరరావు దంపతులు రూ.1,10,116 విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో నగదు అందజేశారు. దేవస్థానం తరఫున పీఆర్‌వో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ దాతకు అందజేశారు.

శెట్టిపాలెంలో కాఫీ పొడి తయారీ కేంద్రం

- స్థలాన్ని పరిశీలించిన గిరిజన కార్పొరేషన్ ఎండీ కల్పనాకుమారి



శెట్టిపాలెంలో భూములను పరిశీలిస్తున్న కల్పనాకుమారి, అధికారులు

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెంలో కాఫీపొడి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించనున్న ఈ కేంద్రం కోసం గ్రామంలోని సర్వే నంబర్లు 108, 109లలో ఉన్న 12 ఎకరాల డి-పట్టాభూములను ఎంపిక చేశారు. ఈ భూములను గిరిజన కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. మ్యాప్, రికార్డులను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, ఆదేశాలు రాగానే నిర్మాణం చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

లారీకి రూ.10 వేలు!



10వ తేదీలోగా పంపించాల్సిందే.. • లేదంటే కేసులు పెడతామని హెచ్చరిక

- రవాణాశాఖకు సంబంధం లేని వ్యక్తి నేరుగా బెదిరింపులు
- డిపార్ట్‌మెంట్ అంటూ కార్యాలయంలోనే తిష్ట
- సంచలనంగా ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యాలకు పంపిన ఆడియో

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'ఈ నెల 10వ తేదీలోగా నా వద్దకు వచ్చి.. కన్ఫర్మ్ చేసుకోండి. 10వ తేదీన జాబితా సిద్ధమవుతుంది. 11వ తేదీ నుంచి ఎవరైనా పట్టుకుంటే నాకు సంబంధం లేదు. ఫోన్ పేలు ఎవరూ చేయవద్దు' అంటూ అనకాపల్లి జిల్లాలో అధిక లోడుతో వెళుతున్న, అనుమతి లేని వాహనాల విషయంలో వసూళ్లకు సంబంధించిన ఆడియో మెసేజ్. ఈ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అసలు ఏ శాఖకు సంబంధం లేని ఓ వ్యక్తి ధైర్యంగా ఆడియో మెసేజ్ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలకు పంపి వసూళ్లకు తెగబడుతున్నాడంటే.. సదరు వ్యక్తికి ఎంతమేర అధికారుల నుంచి అండదండలున్నాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రతి నెలా లారీకి

ఇదీ వసూళ్ల లెక్క..!

అనకాపల్లి జిల్లాలో సెజ్‌లకు ప్రతి రోజూ వందల సంఖ్యలో బస్సులు తిరుగుతుంటాయి. ఇక మైనింగ్ కూడా జోరుగా సాగుతోంది. ఈ మైనింగ్ లారీలు కూడా వందల్లో తిరుగుతున్నాయి. మరోవైపు రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నావికాదళ స్థావర పనులు సాగుతున్నాయి. ఈ పనులకు కూడా లారీలు బండరాళ్లు తరలిస్తుంటాయి. సింహాద్రి ఎన్టీపీసీకి ప్రతి రోజూ బొగ్గు లారీలతో పాటు అక్కడి నుంచి ఫ్లైయాష్‌ను తీసుకెళ్లే లారీలు కూడా పగలు, రాత్రీ తేడా లేకుండా తిరుగుతుంటాయి. ఇవన్నీ కూడా నిర్ణీత పరిమితి మేర లోడ్‌ను తీసుకుని చక్కర్లు కొట్టడం లేదు. ప్రతి వాహనం కూడా అధిక లోడుతోనే వెళుతున్నాయి. ఇదే వసూళ్లకు కేంద్రంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ విధంగా రాంబిల్లికి నావికాదళ పనుల కోసం ప్రతి రోజూ 800 ట్రిప్పుల మేర బండరాళ్లను తీసుకెళుతున్నాయి. 800 ట్రిప్పుల నుంచి ప్రతీ నెలా రూ. 10 వేల చొప్పున రూ. 80 లక్షల మేర వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక సెజ్‌లకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులను తరలించే వాహనాల నుంచి రూ. 2 వేల నుంచి రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇవి రూ.20 లక్షల వరకూ ఉంటున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్టీపీసీకి వెళ్లే బొగ్గు లారీలు.. అక్కడి నుంచి ఫ్లై యాష్ తీసుకొచ్చే లారీల నుంచి కూడా రూ.8 వేల చొప్పున ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ఇవి మరో రూ.50 లక్షల మేర ఉంటున్నట్టు సమాచారం. ఈ విధంగా వసూలు మొత్తం ప్రతీ నెలా రూ.1.5 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ మొత్తం వ్యవహారాన్ని సదరు శాఖకు సంబంధం లేని వ్యక్తి చేస్తున్నారనే బహిరంగ విమర్శలున్నాయి. ఎవరైనా పార్థసారధి అడిగిన మేర ఇవ్వకపోతే అధికలోడుతో వాహనాలు వెళుతున్నాయని వెంటనే కేసులు నమోదవుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.



ఇంత చొప్పున అటు మైనింగ్, ఇటు ఫ్లైయాష్.. అంతేకాకుండా సెజ్‌లకు వెళ్లే బస్సుల యాజమాన్యాలు రవాణాశాఖ అధికారులకు పైకం చెల్లించాల్సిందే. లేకుంటే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ వ్యవహారమంతా ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా రవాణాశాఖ అధికారులు నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. అనకాపల్లిలో ఉంటున్న పార్థసారధి అనే వ్యక్తి ఈ ఆడియో మెసేజ్ పంపినట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తే రవాణాశాఖ అధికారులకు జిల్లా మొత్తం నుంచి వసూలు చేసి వాటాలు పంపుతున్నట్టు విమర్శలున్నాయి. రవాణాశాఖకు సంబంధం లేని సదరు వ్యక్తి.. ఎప్పటికప్పుడు రవాణాశాఖ కార్యాలయంలోనే తిష్టవేసి ఉంటున్నారని కూడా తెలుస్తోంది. అంతేకాకుండా ట్రాన్స్‌పోర్ట్ యజమాన్యాలకు నేరుగా బెదిరింపులకు దిగుతున్నట్టు ఆరోపణలున్నాయి. మొత్తంగా ప్రతి నెలా రూ.కోటిన్నర మేర వసూలు చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.

అటువంటిదేమీ లేదు

ఈ ఆడియోకు మా శాఖకు సంబంధం లేదు. ఎవరు పంపారో తెలియదు. అధిక లోడు, అక్రమంగా రవాణాపై మేం ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. ఏప్రిల్ నెలలో 85 కేసులు రాశాం. తద్వారా అపరాధ రుసుం రూ.65 లక్షల వరకూ విధించాం. అక్రమ రవాణాపై చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– మనోహర్, జిల్లా రవాణాశాఖ అధికారి

మాతృ మరణాలకు కారణమయ్యే ప్రైవేట్ ఆస్పత్రులపై కేసులు

- విశాఖలోని శ్రీ సూర్య ఆస్పత్రి, ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కేసులు నమోదుకు కలెక్టర్ ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: నిర్లక్ష్యంగా వ్యవహరించి, మాతృ మరణాలకు కారణమవుతున్న ప్రైవేటు ఆస్పత్రులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మాతాశిశు మరణాలపై కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. గత త్రైమాసికంలో సంభవించిన నాలుగు మాతృ, 29 శిశు మరణాలకు గల కారణాలను కేసుల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరైన వైద్యం అందించకుండా మరణాలకు కారణమవుతున్న ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అనుమతులు, అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా వైద్యం చేసి మాతృ మరణానికి కారణమైన విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో గల శ్రీ సూర్య ఆస్పత్రి, పిల్లల కోసం వెళ్లిన వారికి చివరి వరకు వైద్యం చేసి అత్యవసర సమయంలో వైద్యం అందించకుండా బాధ్యతారాహితంగా కేజీహెచ్‌కు రిఫర్ చేసిన ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సంఘటనలు జరిగి నెలలు కావస్తున్నా సంబంధిత ఆస్పత్రులపై నివేదికలు రూపొందించడంలో నిర్లక్ష్యం వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన బంగారి లావణ్య జ్వరం, వాంతులతో బాధపడుతూ విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో గల శ్రీ సూర్య ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం అత్యవసర పరిస్థితి ఏర్పడితే మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేయగా వారు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన వెంటనే ఆమె మరణించినట్టు కలెక్టర్ తెలిపారు. మాకవరపాలెంకు చెందిన గన్ని లక్ష్మి విశాఖపట్నంలో గల ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రంలో పిల్లల కోసం వైద్యం చేయించుకోగా, ఎనిమిదవ నెలలో కడుపులో బిడ్డ చనిపోయిన అత్యవసర పరిస్థితుల్లో కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, చికిత్స పొందుతూ మరణించినట్టు తెలిపారు. శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో పాల్మన్‌పేట గ్రామంలో ఒడిశాకు చెందిన మడద లావణ్య హృదయ సంబంధిత సమస్యలతో బాధపడుతూ గీతం ఆస్పత్రిలో 19 రోజులు చికిత్స పొందిన అనంతరం కేజీహెచ్‌కు రిఫర్ చేయగా ఆమె కూడా మరణించినట్టు తెలిపారు. నక్కపల్లి పీహెచ్‌సీ పరిధి చినగుమ్ములూరుకు చెందిన సయ్యద్ మహబున్నిషా ప్రసవం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేరగా అకస్మాత్తుగా పరిస్థితి విషమించి మరణించినట్టు కలెక్టర్ తెలిపారు. వైద్యులు సేవాదృక్పథంతో ప్రజలకు సేవలందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ, డీసీహెచ్‌ఎస్. ఎస్. శ్రీనివాసరావు, డీఐవో కె.చంద్రశేఖర్, శ్రీ సూర్య ఆస్పత్రి, మెడికవర్, ఆరాధ్య సంతాన సాఫల్య కేంద్రం, గీతం ఆస్పత్రి ప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



విలేకరులతో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

చోడవరం: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని, ఆ పార్టీ నాయకులు దందాలు చేసుకోవడానికే అధికారం పనికొచ్చిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.పార్టీ స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో ఒక్కటీ అమలు చేయలేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లి వయా చోడవరం, నర్సీపట్నం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేసినప్పటికీ అప్పటి కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో పనులు పూర్తిస్థాయిలో చేయలేదని చెప్పారు. ఎన్నికల్లో ఇదే రోడ్డును అస్త్రంగా వాడుకొని గెలిచిన ఆపార్టీ నాయకులు ఇప్పుడు ఎందుకు ఈ రోడ్డు బాగుచేయడానికి చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు.రోలుగుంట మండలంలో క్వారీల వద్ద టీడీపీ నాయకులు దందాలకు పాల్పడుతున్నారని, టన్నుకి రూ.200 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 5వతేదీన నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీనిమరింత బలోపేతం చేసే దిశగా చర్చించడంతోపాటు కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు విభాగం అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, ఎంపీపీలు గాడి కాసు, శ్రీనివాసరావు వైస్ ఎంపీపీలు దొండా నారాయణ మూర్తి, శరగడం నాగేశ్వరరావు, డీఆర్‌యూసీ సభ్యు డు బొడ్డు శ్రీరామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- వచ్చేనెల 4న శాంతియుత నిరసన ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- డీఎస్పీకి వినతిపత్రం అందజేత



ర్యాలీకి అనుమతి కోరుతూ డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ప్రభుత్వం కొలువుతీరి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వచ్చేనెల 4వ తేదీన నర్సీపట్నంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ర్యాలీకి అనుమతి కోరుతూ పార్టీ నాయకులతో కలిసి ఆయన డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలతో మరింత మేలు చేకూరుతుందని ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించి మోసపోయారని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో ఒక్క పథకం కూడా అమలు కాలేదన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో నిరుద్యోగులు 10 వేల మంది ఉన్నారని, వీరందరికీ రూ. 3 వేల చొప్పున ఏడాదికి రూ.36 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాది రూ.15వేల చొప్పున మొత్తం రూ.60.43 కోట్లు చెల్లించాలన్నారు. నియోజకవర్గంలో 42 వేల మందికి రైతు భరోసా పథకం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కో రైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందజేసి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.84 కోట్లు రైతులకు అందించాల్సి ఉందని చెప్పారు. మహాశక్తి పథకంలో 19 నుంచి 59 వయస్సు కలిగిన మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ప్రకటించారని, నియోజకవర్గంలోని 90 వేల మంది మహిళలకు రూ.162 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. ఉచిత సిలెండర్ల పథకాన్ని అటకెక్కించారని ఆరోపించారు. ఈ ఏడాదిలో ఒక్క సిలిండర్‌కు మాత్రమే నగదు చెల్లించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో 50 ఏళ్లు కలిగిన వారు 21 వేలు మంది ఉన్నారని, వీరందరికీ నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి సుమారు రూ.వంద కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఉచిత బస్సు ఊసేలేదన్నారు. అన్ని విధాలా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎస్పీని కలిసిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీ సాగిన లక్ష్మణ్ మూర్తి, మాజీఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మాకవపాలెం, గొలుగొండ, మాకవరపాలెం మండల అధ్యక్షులు చిటికెల రమణ, లెక్కల సత్యనారాయణ, చిటికెల వెంకటరమణ, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. వర్ష బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



కె.జె.పురం జంక్షన్‌లో నేలకొరిగిన తాటిచెట్టు



కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

నక్కపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పెద్ద సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. మండల కేంద్రం నక్కపల్లితో పాటు ఉపమాక,సారిపల్లిపాలెం, బోదిగళం,మనబానవానిపాలెం, అప్పలపాయకరావుపేట తదితర ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.భారీ వృక్షాలు సైతం కూకటివేళ్లతో కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి.విద్యుత్ వైర్లు, స్తంభాలు రోడ్డుపైన, ఇళ్లపైన పడిపోవడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. నక్కపల్లిలో ఉపమాక రోడ్డు, బండారుపేట, కొత్తపేట, రాజీవ్‌నగర్ కాలనీ,వీవర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ,రెల్లి వీధి,ఎన్టీఆర్ బొదిగళ్లంరోడ్డు తదితర ప్రాంతాల్లో సుమారు 30 స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంబీస్విచ్ కండక్టర్లు సైతం విరిగిపోయాయి.జాతీయ రహదారిపై ఉపమాక రోడ్డు ఆర్చి ఎదురుగా కండక్టర్ తెగిరోడ్డుపై పడడంతో వాహనాలు నిలిచిపోయాయి.ట్రాన్స్‌కో సిబ్బంది స్థానికులు సాయంతో వైర్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.ట్రాన్స్‌కోకు లక్షల్లో నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది.ఉపమాక సబ్ స్టేషన్ నుంచి పలు గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆదివారం సాయంత్రానికి మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరణ చేసే అవకాశం ఉందని ట్రాన్స్ కో సిబ్బంది తెలిపారు.ప్రస్తుతం నక్కపల్లి పట్టణం అంధకారంలో ఉంది.

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం,మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఏటికొప్పాక,పద్మనాభరాజుపేటల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది.ఫ్లెక్సీలు చిరిగి ఎగిరిపోయాయి.పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.ఉరుములు,మెరుపులతో కురిసిన వర్షానికి ప్రజలు బెంబేలెత్తిపోయారు.యలమంచిలి పట్టణంలో పలు ప్రధాన వీధిరోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.మురుగుకాల్వలు పూడుకుపోవడం,సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రహదారులు జలమయమవుతున్నాయి. రేగుపాలెం ముస్లిం కాలనీలో ఓ ఇంటి ముందుభాగం కూలింది. కూలిన ఇంటిని గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి రవి పరిశీలించారు. గాలివాన బీభత్సంతో యలమంచిలి పట్టణం సహా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మెయిన్‌రోడ్డులో వర్షం కారణంగా భారీగా నీరు నిలిచిపోయింది. కైలాసపట్నంలో ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా గ్రామానికి చెందిన పేద వృద్ధ దంపతులు కుందూరు అప్పన్న, వెన్నెలమ్మలకు చెందిన పెంకుటిల్లు నేలకూలింది. కుందూరు నాగేశ్వరరావుకు చెందిన పెంకుటిల్లు పైకప్పు కొంత మేర కూలిపోయింది. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వృద్ధ దంపతులు కోరారు.

మాడుగుల రూరల్ : మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. కె.జె.పురం జంక్షన్, ఎం.కోడూరు, వీరవల్లి అగ్రహారం తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కె.జె.పురం– దబ్బకుంట రహదారిలో పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. కె.జె.పురం జంక్షన్‌లో తాటి చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఘాట్‌రోడ్డు జంక్షన్ దాటిన తర్వాత పాడేరు వెళ్లే రహదారిలో రెండు చెట్లు నేలకొరిగాయి. స్థానిక ఎంపీపీ టి.వి.రాజారామ్ పర్యవేక్షించి, చెట్లను తొలగించారు.

కశింకోట: మండలం కేంద్రం కశింకోటలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు గవరపేట, గాడివీధి, స్టేట్ బ్యాంకు, పూసర్ల వీధి ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండిపోయింది.ఆర్టీసీ బస్ స్టేషన్‌లో గోతుల్లో భారీగా నీరు చేరింది. ఈదురు గాలుల వల్ల మామిడి కాయలు రాలిపోయాయి. అరటి చెట్లు కూలిపోవడంతో రైతులు నష్టపోయారు.



ఇంటిపై కూలిన చెట్టు



రేగుపాలెం ముస్లిం కాలనీలో కూలిన ఇంటి ముందుభాగం పరిశీలిస్తున్న సర్పంచ్ రాజాన మహాలక్ష్మి



కైలాసపట్నంలో దెబ్బతిన్న పెంకుటిల్లు

క్లుప్తంగా

డీజిల్ అక్రమ నిల్వ స్థావరంపై దాడి

అచ్యుతాపురం రూరల్: అక్రమంగా డీజిల్ నిల్వ చేసిన స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నమ్మి గణేష్ శనివారం తెలిపారు. సమాచారం మేరకు నార పాక కూడలిలో కొరుపోలు సరోజారావుకు చెందిన ఖాళీ స్థలంలో మునగపాక మండలం నాగవరం గ్రామానికి చెందిన అప్పికొండ వెంకటేష్ అద్దెకు తీసుకుని ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ చేసిన 396 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. డీజిల్ ట్యాంకర్ (ఏపీ39టీఎన్2244) డ్రైవర్‌గా పని చేస్తున్న మరో వ్యక్తి అచ్యుతాపురం మండలం ఆవరాజాం గ్రామానికి చెందిన కంఠంరెడ్డి శ్రీనివాస్ ఆయిల్ తీస్తుండగా గుర్తించామన్నారు. అక్రమంగా డీజిల్ అమ్మినా కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమని, వారికి తెలియజేసి వారిపై కేసు నమోదు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 28 తులాలు వెండి, నగదు తస్కరణ

అనకాపల్లి: మండలంలో మామిడిపాలెం గ్రామానికి చెందిన నంబారు వెంకటరమణ గృహంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. 28 తులాల వెండి, రూ.1500 ఎత్తుకుపోయినట్లు రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. హెచ్‌సీ కొండయ్య వివరాలు మేరకు... బాధితుడు వెంకటరమణ శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగివచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులుగొట్టి బీరువాలోని 28 తులాలు వెండి, రూ.1500 మాయమైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ప్రత్యేక ఉపాధ్యాయుడికి అభినందన



కలెక్టర్‌చేతుల మీదుగా స్పెషల్ ఒలింపిక్ భారత్ కోచ్ సర్టిఫికెట్ అందుకుంటున్న మహాలక్ష్మినాయుడు

రావికమతం : రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్–2025 క్రీడా పోటీల్లో అనకాపల్లి జిల్లా నుంచి ఐదుగురు పిల్లలు పాల్గొని, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఇద్దరు దివ్యాంగ విద్యార్థులు ఎంపికవడంతో ఆ విద్యార్థులకు శిక్షణ అందించిన మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడును కలెక్టర్ విజయ కృష్ణన్ స్పెషల్ ఒలింపిక్ భారత్ కోచ్ సర్టిఫికెట్ అందించి అభినందించారు. మహాలక్ష్మినాయుడును అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త,సమగ్ర శిక్ష అధికారులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వరుస దొంగతనాలతో జనం బెంబేలు

- వేసవి సెలవులకు వెళ్లిన వారి ఇళ్లే టార్గెట్
- రాత్రి గస్తీ అంతంత మాత్రం

అనకాపల్లి టౌన్ : పట్టణంలో మండలంలో వరుస దొంగతనాలలో ప్రజలు బెంబేలెత్తున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న దొంగతనాలు అటు పోలీసులకు, ఇటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో ఎక్కువగా తీర్థయాత్రలకు, బంధువుల ఇళ్లకు కుటుంబమంతా వెళుతుంటారు. దీనినే ఆసరాగా చేసుకొని దొంగలు తమ పని కానిచేస్తున్నారు. పగలు రెక్కి, రాత్రి చోరీలకు పాల్పడుతున్నారు. తాళం వేసిన ఇళ్లను ఎంచుకొని నగదు, బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా మండల ప్రాంతాలలో చాలా ప్రదేశాలలో సీసీ కెమెరాలు లేవు.

ఒకే రోజు మూడు దొంగతనాలు..

మూడు రోజుల క్రితం జాతీయ రహదారికి అనుకొని ఒకే రోజు మూడు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొండ కొప్పాక గ్రామంలో రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి కుటుంబసభ్యులతో ఉంటున్నారు. వీరి బంధువులకు బాగోలేదని ఇంటికి తాళం వేసి కూర్మన్నపాలెం వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి తులం పావు బంగారు వస్తువులు, ఐదు వేల నగదు అపహరించారు. ఈ ఇంటికి ఎదురుగా ఉన్న మరో ఇంటి యజమాని కూడా హైదరాబాద్ వెళ్లడంతో ఆ ఇంట్లో కూడా దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రెండు కేజీల వెండి, లక్ష రూపాయల నగదు దోచుకెళ్లారు. జాతీయ రహదారి ఎన్జీఓ కాలనీ సాయినగర్ ఒక ఇంటి వెనక కిటికీ పగులగొట్టి ల్యాప్‌ట్యాప్, కారు తాళాలు, బ్యాగ్‌ను అపహరించారు. ఇలా ఒకే రోజు మూడు దొంగతాలు జరగడంతో జనం బెంబేలెత్తారు. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.



ఊళ్లకు వెళితే సమాచారం ఇవ్వండి



వేసవి సెలవుల నేపథ్యంలో ఊర్లకు వెళ్లిన వారు ఇంటిలో విలువైన వస్తువులు ఉంచరాదు. ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చి రిక్వెస్ట్ లెటర్ ఇస్తే ఇంటిలో ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ (లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ఏర్పాటు చేస్తాం. దీనివలన యజమాని సెల్ ద్వారా ఇంటిని చూసుకొనే వీలు ఉంటుంది. అలాగే పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా కూడా పోలీసులు పర్యవేక్షిస్తుంటారు. ఒక వేళ అత్యవసరం మీద వెళ్లిన వారు కూడా పోలీసులకు తెలియపరిస్తే డే అండ్ నైట్ బీట్‌లను ఏర్పాటు చేస్తాం.

– అల్లు వెంకటేశ్వరావు, పట్టణ ఎస్ఐ, క్రైం

భూ సేకరణకు రైతులతో ఆర్‌డీఓ సమావేశం



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

అచ్యుతాపురం రూరల్ : దొప్పెర్ల గ్రామంలో శనివారం అనకాపల్లి ఆర్‌డీఓ షేక్ ఆయిషా భూ–సేకరణ విషయమై రైతులతో సమావేశమయ్యారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం తమకు ఎటువంటి ముందస్తు నోటీసులు కానీ సమాచారం లేకుండా సుమారు 13 ఎకరాల జిరాయితీ భూమి బార్క్ పరిశ్రమకు రిజిస్ట్రేషన్ చేయాలన్నారని రైతులు తెలిపారు. రెండు మూడు రోజుల్లో మీ భూమి ఎంతైతే ఉందో దానికి వెల కట్టి రేటు నిర్ణయిస్తామన్నారని రైతులన్నారు. ఇదంతా ఒక వైపే మాట్లాడుతున్నారే తప్ప అసలు రైతు అభిప్రాయం ఏమిటని అడగలేదని రైతులు ఆవేదన చెందారు. సర్వే నంబర్లు 157, 158, 161, 162, 163గల జిరాయితీ భూమి ప్రభుత్వానికి కాకుండా బార్క్ పరిశ్రమకు ఇవ్వాలనడం ఏమిటని రైతులు ఆలోచనలో పడ్డారు. భూమి ప్రభుత్వానికి కాకుండా బార్క్ ఇవ్వాలని చెప్పడానికి అధికారులు రావడం ఏమిటని రైతులూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఒకవేళ భూమి ప్రభుత్వానికి అవసరమై తీసుకున్నట్టయితే రైతుల డిమాండ్ ప్రకారం డీ–పట్టాకైతే ఎకరా రూ.60లక్షలు, జిరాయితీ భూమికి రూ.2 కోట్లు, ఆర్ కార్డులు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్, ఇంటి స్థలాలతో ఒప్పందానికి చర్చలు జరిపి రైతులందరి అంగీకారంతో ప్రభుత్వానికి ఇస్తామన్నారు. ప్రజలకు అధికారులు సరైన అవగాహన కల్పించకుంటే భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని రైతులన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వరహాలు, ఆర్ఐ ఈశ్వర్, మండల సర్వేయర్ రాధ, దొప్పెర్ల ఎంపీటీసీ పల్లి వెంకటరావు, రైతులు పల్లి శేషగిరిరావు, కొల్లి వరహాలరావు, కొల్లి సన్నిబాబు పాల్గొన్నారు.

అమ్మ హెల్పింగ్ హార్ట్స్‌కు పురస్కారం

బుచ్చెయ్యపేట : వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థకు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం అవార్డు లభించింది. వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ గత 16 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయమే కాక ఆపదలో ఉన్న వేలాది మందికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుతున్నారు. ఇప్పటి వరకు పలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది యూనిట్లు రక్తాన్ని సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను చైతన్య పరుస్తూ,యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగేలా పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సేవలకు గాను తెలంగాణ ప్రాంతానికి చెందిన భద్రాది యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వారు ఈ అవార్డును ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి చేతుల మీదుగా యంగ్ ఇండియన్ బ్లడ్ ఓనర్స్ క్లబ్ సభ్యులు అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులకు ఈ అవార్డును అందించారు.



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు

యువకుడికి త్రుటిలో తప్పిన ప్రమాదం



బైక్‌పై వెళ్తున్న యువకునిపై బారికేడ్ పడడంతో అతనిని లేవనెత్తుతున్న మరో వ్యక్తి

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రమైన అచ్యుతాపురంలో ఫ్లై–ఓవర్ నిర్మాణానికి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్ (ఇనుప రేకు) బైక్‌పై వెళ్తున్న ఒక యువకునిపై ఒక్కసారిగా పడడంతో బైక్‌తోపాటు రోడ్డుపై ఆ యువకుడు పడిపోయాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న భారీ టిప్పర్ లారీ ఒక్క క్షణం ఆలస్యంగా రావడంతో ప్రాణాలు దక్కించుకోగలిగాడని ఆ యువకునితో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఫ్లై–ఓవర్ పనుల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుంటే అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజూ వేలాది వాహనాలు రాకపోకలు చేసే సెజ్ పూడిమడక రహదారిలో ట్రాఫిక్ నియంత్రణ సరిలేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేయకుండా వేలాది వాహనాలకు పూడిమడక రోడ్డు ఒక్కటే దిక్కవడంతో అచ్యుతాపురం గ్రామస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రోడ్డుపై వెళ్లడానికి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

వివాహేతర బంధానికి అడ్డని అంతం చేశారు

- ప్రియుడు, అతని స్నేహితుడితో కలసి భార్య ఘాతుకం
- చేబ్రోలు హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్టు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ బిందుమాధవ్



నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తాళి కట్టిన భర్తను ప్రియుడితో కలసి అతి కిరాతకంగా సర్జికల్ బ్లేడుతో హత్య చేసింది ఆమె. మార్చి మూడో తేదీన గొల్లప్రోలు మండలం చేబ్రోలులో 216 జాతీయ రహదారి పక్కన లభ్యమైన వ్యక్తి మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కత్తిపూడి–కాకినాడ జాతీయ రహదారి పక్కన కల్వర్టు వద్ద పంట బోదెలో ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో పోలీసులు గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ మృతదేహంపై గాయాలు ఉండడంతో సీఐ జి.శ్రీనివాస్ హత్య కేసుగా మార్చి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షణలో ఎస్‌డీపీఓ దేవరాజ్ మనీష్ పాటిల్ మార్గదర్శకంలో సర్కిల్ ఎస్ఐలు నాలుగు ప్రత్యేక బృందాలుగా దర్యాప్తు చేపట్టారన్నారు. రాష్ట్రంతో పాటు, సరిహద్దు రాష్ట్రాల మిస్సింగ్ కేసుల డేటా, హైవే సీసీ కెమెరా ఫుటేజీ, టోల్ ప్లాజా, సెల్ టవర్ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 28న అనకాపల్లి జిల్లా యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుపై దర్యాప్తు బృందం దృష్టి సారించింది. అక్కడి ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వ్యక్తి వివరాలతో ఇక్కడి లభ్యమైన మృతదేహం వివరాలు పోలి ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతుడు ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ల లోవరాజుగా గుర్తించారు. అనకాపల్లి జిల్లా యలమంచిలికి చెందిన అతని భార్య శ్యామల, భర్త బంధువు అయిన మోహన్‌కుమార్‌తో వివాహేతర సంబంధం నెరపుతూ తమకు అడ్డంగా ఉన్న భర్తను తొలగించాలని భావించింది. పథకం ప్రకారం ప్రియుడు మోహన్‌కుమార్, అతని స్నేహితుడు గంగాధర్, ముగ్గురూ కలిసి గత ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి లోవరాజును హత్య చేసి మృతదేహాన్ని చేబ్రోలు హైవే వద్ద పడవేసినట్టు దర్యాప్తులో గుర్తించారు. హత్య చేయడానికి రెండు సర్జికల్ బ్లేడ్‌లను సిద్ధం చేసుకుని, పిల్లలు పడుకున్నాక మోహన్‌కుమార్, గంగాధర్ ఇంటిలోకి ప్రవేశించి లోవరాజుపై దాడి చేసి బ్లేడ్‌లతో పీకకోసి, గుండెల్లో పొడిచినట్టు పోలీసులు తెలిపారు. రాంబాబు అరవడానికి ప్రయత్నించగా నోట్లో గుడ్డలు కుక్కేసారని, అప్పటికీ లోవరాజు చనిపోకపోవడంతో కాలి చీలమండ కోసి రక్తం పోయేలా చేసి హత్య చేసినట్టు ఎస్పీ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని కారులో తమకు పరిచయం ఉన్న ప్రాంతమైన చేబ్రోలు హైవే పక్కన పడేసి పరారయ్యారన్నారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ జి. శ్రీనివాస్, ఎస్ఐ ఎన్. రామకృష్ణ, ఎస్ఐటీ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆస్పత్రి ఆవరణలో హిజ్రా మృతి

కారణం తెలియని మృతిగా కేసు నమోదు



హిజ్రా ఆకాంక్ష మృతదేహం

కొయ్యూరు: మండలంలోని డౌనూరు ఆస్పత్రిలో హిజ్రా పులి కుమారస్వామి అలియాస్ ఆకాంక్ష(23) మృతిపై పోలీసులు శనివారం విచారణ చేపట్టారు. గొలుగొండ మండలం జోగంపేటకు చెందిన ఆకాంక్ష కొద్ది రోజుల నుంచి డౌనూరులో ఉంటోంది. ఆమె ఇక్కడ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం అర్ధరాత్రి అనుమానాస్పద రీతిలో మరణించారు. శనివారం తెల్లవారుజామున మృతదేహాన్ని చూసిన వైద్యురాలు లలిత వెంటనే కొయ్యూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వెంకటరమణ, ఎస్ఐ కిశోర్‌వర్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె మరణానికి డీహైడ్రేషన్ కారణం కావచ్చని అంచనాకు వచ్చారు. కారణం తెలియని మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. శుక్రవారం ఆకాంక్ష కడుపుమంటగా ఉందని డౌనూరు ఆస్పత్రికి వచ్చి గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన రెంటాడిన్ ఇంజక్షన్ చేయించుకున్నారని తెలిపారు. తర్వాత సంతలోకి వెళ్లిపోయారన్నారు. దీని తర్వాత ఆమె అదే రోజు రాత్రి ఆస్పత్రి ఆవరణలో రోగులు కూర్చునే బల్లపై ఉండిపోయారన్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురై అర్ధరాత్రి సమయంలో మరణించి ఉంటారని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని చెప్పారు. కాగా పాడేరు నుంచి క్లూస్ టీం వచ్చి సంఘటన స్థలంలో పరిశీలించింది.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు కలెక్టర్ అభినందన

రావికమతం: టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని గర్నికం కస్తూర్బా గాంధీ బాలకల విద్యాలయం విద్యార్థినులను కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో 568 మార్కులు సాధించిన వర్షిత లాస్య, 567 మార్కులు సాధించిన ఇందుశ్రీ, ఇంటర్మీడియట్‌లో 969 మార్కులు సాధించిన టి.అశ్వనిలను అభినందించి సత్కరించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భానును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పిడుగు పడి పాడిగేదె మృతి

చీడికాడ : మండలంలో జి.కొత్తపల్లి పంచాయతీ చిన గోగాడ గ్రామంలో శనివారం పిడుగు పడి పాడి గేదె మృతి చెందింది.గ్రామానికి చెందిన కోనేటి సత్తిబాబు ఎప్పటిలాగే పశువులను మేతకు వదిలాడు. ఆ సమయంలో పిడుగు పడి గేదె మృతి చెందడంతో రూ.80 వేలు నష్టం వచ్చినట్టు బాధితుడు సత్తిబాబు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

గాలివాన బీభత్సం

జిల్లాలో పలు చోట్ల శనివారం గాలీవర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు, జలమయ్యాయి.



యలమంచిలిలో శనివారం మధ్యాహ్నం ఆకాశంలో కారుమబ్బులు



వి.వి.అగ్రహారంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని గోతుల్లో చేరిన నీరు



కశింకోటలోని పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో చేరిన నీరు



నక్కపల్లి నుంచి ఉపమాక వెళ్లే రోడ్డులో కూలిన చెట్లు



నక్కపల్లిలో ఈదురు గాలులకు నేలకూలిన విద్యుత్‌స్తంభాలు



యలమంచిలి క్లబ్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు



రోడ్డుకు అడ్డంగా పలువీధుల్లో పడిపోయిన స్తంభాలురోడ్డుపై కూలిన చెట్లు



కైలాసపట్నంలో కూలిన ఇంటి పైకప్పు

క్లుప్తంగా

వర్షంతో రహదారులు జలమయం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిపోయిన వర్షం నీరు

అనకాపల్లి టౌన్: పట్టణంలో శనివారం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపించాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. సుమారు అరగంట సేపు కురిసిన వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో సేదతీరారు.

మూడు శాతం క్రీడా కోటా అమలు చేయాలి

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే వివిధ నియామకాల్లో మూడు శాతం క్రీడా కోటా అమలు చేయాలని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరికి వెంకట్రావు అన్నారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో క్రీడా కోటా మూడు శాతం పెంచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి కె.ఎం. నాయుడు, ఎస్. శ్రీనివాసరావు, పీవీ నాయుడు, జి. శ్యామ్ ప్రసాద్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు వయోవృద్ధుల సంఘం సమావేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం వి.వి. రమణ రైతుభారతి కేంద్రంలో ఈ నెల 5న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం జరుగుతుందని సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ సమావేశంలో వృద్ధుల ఆరోగ్య సమస్యలపై చర్చించి, అవసరమైన వారికి ఆయుర్వేద మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారుల సందడి



తాళ్లపాలెం గ్రంథాలయంలో కళ్ల గంతలాట ఆడుతున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కళ్ల గంతలాట, కంప్యూటర్ గేమ్స్ నిర్వహించారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం 'గ్రంథాలయ ప్రయోజనాలు'అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థులు పోటీలో పాల్గొనాలని గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 455 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,760
రెండో రకం	3,750	4,290
మూడోరకం	3,400	3,750

అనకాపల్లి సినిమాలు

రాజా :రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1:అర్జున్ సనాఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 :థండర్ బోల్ట్స్
పర్తిసాయి :హిట్-3
షిర్డీసాయి :ఓదెల 2
వెంకటేశ్వర : జింఖానా
శ్రీసత్య :సారంగపాణి జాతకం
రామచంద్ర :తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని (08924-223595) సంప్రదించవచ్చు.

చేసిన మేలుకు.. మసిపూసే ప్రయత్నం



వెంకుపాలెంలోని సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం

గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాల కుదింపునకు కుట్ర

చాపకింద నీరులా చర్యలు

పట్టణ, మండల పరిధిలో 56 సచివాలయాలు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు

వాటిని 30కి తగ్గించేందుకు కసరత్తు

అనకాపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. కూటమి పాలనలో ఏడాది నుంచి ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదు. గ్రామ, వార్డు సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. వాటి సంఖ్యను కుదించాలని చూస్తోంది. దీనిపై పట్టణ, గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరలా మండల కార్యాలయాల చుట్టూ గ్రామీణ ప్రజలు ప్రదక్షిణలు చేయాలని ఆందోళనకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణ, మండలంలో 53 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు అందిస్తే, వాటిని కుదించేందుకు కూటమి ప్రభుత్వం చాపకింద నీరులా పావులు కదుపుతోంది. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వ సేవలకు దూరమయ్యే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని అంతా భయపడుతున్నారు. 53 సచివాలయాలకు 30 సచివాలయాలు ఉండే విధంగా ఇప్పటికే అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎక్కడి సచివాలయాలు తొలగిస్తారో అర్థం కావడంలేదు. తొలగించే సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళనలో పడ్డారు. నాలుగు నుంచి ఐదు గ్రామాల ప్రజలకు ఒకేచోట సేవలు అందించనున్నారు. జనాభాను దృష్టిలో పెట్టుకుని సచివాలయాలను కుదిస్తున్నారు. ఇదే విధానం ఆర్బీకేలకు వర్తించనున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చూపించకుండా ఉన్న ఉద్యోగాలను దశలవారీగా తొలగించేందుకు చర్యలు చేపట్టడం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇంటి ముంగిటకు వచ్చే వలంటీర్ల ఉద్యోగాలు తొలగించారు.

సర్వేలో సచివాలయ ఉద్యోగులు..

200కు పైగా సేవలు అందించే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 30 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయలేదు. వలంటీర్లను తొలగించి వారు చేస్తున్న పనులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. అంతటితో ఆగకుండా 30కి పైగా సర్వే బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. దీంతో వారు నిత్యం ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. దీని వల్ల కార్యాలయాల్లో పనులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

సచివాలయాలు సౌకర్యవంతం..



సచివాలయ వ్యవస్థ అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంది. ఈ వ్యవస్థను కుదించడం ద్వారా మళ్లీ ఒక గ్రామానికి చెందిన వారు మరో గ్రామానికి వెళ్లాల్సి వస్తుంది. ఇది ఇబ్బందికరం. ఈ విషయంలో రాజకీయం చేయకుండా సచివాలయాలను యథావిధిగా కొనసాగించాలి. – వల్లేల సాయి, కుంచంగి గ్రామం, అనకాపల్లి మండలం

రైతు సేవా కేంద్రాల తగ్గింపు తగదు..



రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉండాలి. ఎరువులు, పశువుల దాణా, విత్తనాలతో పాటు రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలి. కియోస్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు అండగా ఉండాలి. అగ్రికల్చర్ అసిస్టెంట్ల కొరత లేకుండా చూడాలి. కుదిస్తే రైతులకు కష్టాలు తప్పవు. – పి.ఈశ్వరరావు, రైతు, గొలగాం గ్రామం, అనకాపల్లి మండలం



వెంకుపాలెం సచివాలయం

రైతు సేవా కేంద్రాలు...

వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుసేవా కేంద్రాలుగా వాటి పేరు మార్పు చేశారు. ఆ తర్వాత వాటి ప్రాధాన్యతను క్రమేణా తగ్గించే కుట్ర చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువులకు దాణా, పంటల మార్కెటింగ్ తదితర సేవలు అందించేందుకు ఈ విధానం ఉపయోగపడేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పని చేయకపోవడంతో వాటి సేవలకు మంగళం పలికారు.

పైరుకోత వాయిదా వేసుకోవాలి

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున కోత దశలో ఉన్న పైర్లను కోయడం వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు చెరకులో పీక పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని 45 రోజుల వయసు గల కార్శి చేసిన పైరులో ఎకరాకు 150 కిలోల యూరియా వేసుకోవాలని తెలిపారు. నేలలో తేమ సమృద్ధిగా ఉన్నప్పుడే ఎరువులు వేసుకోవాలని, 90 రోజుల వయసు గల చెరకు తోటల్లో ఎకరాకు 75 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. గాలి, వర్ష సూచన ఉన్నందున పక్వానికి వచ్చిన పళ్లు, కూరగాయలు కోసి మార్కెట్‌కు తరలించాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవిలో దుక్కు దున్నుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల అవశేషాలు, కలుపు విత్తనాలు భూ ఉపరితలానికి చేరి, అవి సూర్యరశ్మి ద్వారా నిర్మూలించబడతాయని తెలిపారు. రుతుపవనాలు ఏర్పడిన వెంటనే పంట విత్తుకోవడం లేదా నాటుకోడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

పోరాటాలతోనే యువతకు మెరుగైన మనుగడ



ఏఐవైఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు

అనకాపల్లి: విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనే లక్ష్యంగా దేశంలోని కోట్లాది మంది యువత పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఏఐవైఎఫ్ కార్యాలయం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 66వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో జన్మించిన ప్రతి పౌరుడికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా విద్యనభ్యసించిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. కేంద్రంలో 11 ఏళ్ల క్రితం అధికారాన్ని కైవసం చేసుకునే ముందు మోదీ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారన్నారు. ఇప్పటికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. దేశంలో 42 శాతం నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని, 18 నుంచి 25 ఏళ్ల వయసు గల యువత 50 శాతం ఉన్నట్లు ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే రాష్ట్రానికి నూతన పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పిన చంద్రబాబు యువతను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని, అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి యువత బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు శ్రావణి, దివ్య, లావణ్య, కీర్తన, అపర్ణ, నాయుడు, శ్రీనివాస్, సురేష్, మనోజ్, తరుణ్, జగదీష్, భానుప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



మామిడిపల్లిలో పారిశుధ్య పనులు చేపడుతున్న జెడ్పీటీసీ సత్యం, ప్రత్యేక అధికారి మంజులవాణి

దేవరాపల్లి : సమష్టి బాధ్యతగా పారిశుద్ధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి అన్నారు. మామిడిపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు పర్యటించారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తదితర అధికారులతో పాటు జెడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, స్థానిక పశువైద్యశాలలో తుప్పలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. వీరంతా పార చేత పట్టి ఆస్పత్రి పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం స్థానిక సచివాలయంలో గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. పీ-4 సర్వేలో గుర్తించిన నిరుపేదలను గ్రామ పెద్దలు అధికారుల సమక్షంలో దత్తత తీసుకున్నారు. ఇంటింటా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న వాహనం వద్ద చేరుకొని రేషన్ పంపిణీ తీరును, ఈకేవైసీ ఎంత మేర పూర్తయ్యింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలం నాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, హౌసింగ్ ఇంచార్జ్ ఏఈ ఎస్.భవ్యతేజ, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు, స్థానిక పశువైద్యాధికారి జి.ప్రియాంక, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ సెక్రటరీ శివ పాల్గొన్నారు.

కార్మిక చట్టాల ఉల్లంఘన చట్టరీత్యా నేరం



జీడిపిక్కల పరిశ్రమలో కార్మికులతో మాట్లాడుతున్న న్యాయవాది నూకరాజు

ఎస్.రాయవరం: వ్యాపారులు కార్మిక చట్టానికి లోబడి నడుచుకోవాలని యలమంచిలి కోర్టు ప్యానల్ న్యాయవాది తుమ్మపాల నూకరాజు తెలిపారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అడ్డురోడ్డు జీడిపిక్కల పరిశ్రమ, రెండు దాబాలను సందర్శించి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. అక్కడ పని చేస్తున్న వారికి సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ వారు కార్మికులు పనిచేసే వాణిజ్య సముదాయాలను సందర్శించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్మికులకు సదుపాయాల కల్పన, వెట్టి చాకిరీ వంటి పనులు వ్యాపార నిర్వాహకులపై న్యాయపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి మణికుమార్‌బాబు, తిమ్మాపురం వీఆర్వో గోపి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు తలుపులమ్మ పండగ

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామదేవత తలుపులమ్మ అమ్మవారి పండగను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాన్ని విద్యుద్దీపాలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, త్రిపురవానిపాలెం, ఏఎస్ పేట, సోమవరం, గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, పరవాడపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం తదతర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించి భూ సమస్యలకు సంబంధించి మూడు అర్జీలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి సుభాషిణి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఉప తహసీల్దార్ కుమారస్వామి, ఏఎస్ఐ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలు గీయటంలో విద్యార్థులకు తర్ఫీదు



వేసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

నర్సీపట్నం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు బొమ్మలు గీయడంపై తర్ఫీదు ఇచ్చారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రవికుమార్ బొమ్మలకు ఏవిధంగా రంగులు వేయాలో వేసి చూపించి, విద్యార్థులతో వేయించారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థి కృష్ణవేణి స్పోకెన్ ఇంగ్లిష్‌లో పదాలు ఎన్ని రకాలు, వాటిని ఎలా ఉపయోగించాలో వివరించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె వద్ద రాము

అనకాపల్లి: మండలంలోని వెంకుపాలెంలో శనివారం భారీ వర్షం కురిసి, పిడుగులు పడడంతో బుద్ధ రాము పాడి గేదె మృతి చెందింది. సుమారు రూ.90 వేలు విలువ చేసే గేదె మృతి చెందడంతో రైతు రాము కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారికి తెలిపినట్లు అతను చెప్పాడు. అధికారులు తనను ఆర్థికంగా ఆదుకోవాలని రాము కోరాడు.

రేపటి నుంచి వృద్ధులకు గుర్తింపు కార్డుల పంపిణీ

అనకాపల్లి: మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీలో ఈనెల 5 నుంచి 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వంచే గుర్తింపు కార్డుల పంపిణీ జరుగుతుందని గ్రామ సర్పంచ్ సాలాపు శాంతిసూరి అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయంలో సీనియర్ సిటిజన్ కార్డులు చేయించుకోవలసిన వృద్ధులు ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్ నంబర్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్లడ్ గ్రూప్ తీసుకెళ్లాలని తెలిపారు.

శునకాలను అరికట్టాలని వినతి



జీవీఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయని, వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యులు తెలిపారు. జీవీఎంసీ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించి, కార్యాలయ ఇన్‌చార్జి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కల వల్ల మనుషుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏ వీధిలో చూసినా విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కొల్లు చిన్న అప్పారావు, బొబ్బిలి గోవిందరాజు, ఆడారి బుచ్చి రాము, ముగడా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: మండలంలోని మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు టెన్త్‌లో చక్కటి ఉత్తీర్ణత సాధించడంతో గ్రామంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హెచ్.బి. శ్రీధర్ మాట్లాడుతూ పి. భవిత 588 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే 100 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు బాబు, వసంతరావు, కరుణ జ్యోతి, సుబ్రహ్మణ్యం, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కశింకోట: మండలంలోని తేగాడలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో టెన్త్, ఇంటర్లలో అత్యధిక మార్కులతో ప్రతిభ చాటిన 9 మంది విద్యార్థులు కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి అభినందనలు అందుకున్నారు. టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జి. లావణ్య (566 మార్కులు), ఎస్. లక్ష్మీప్రసన్న (555), సీహెచ్ ప్రవీణ (551), ఇంటర్‌లో వెయ్యి మార్కులకు కె. రాజులమ్మ 983 మార్కులతో రాష్ట్రంలోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రథమ స్థానంలో నిలవగా, ఎం. రూప (979 మార్కులు), కె. లక్ష్మీదేవి(973), కె. పావని (956), వి. హేమ (955), కె. రామదేవి (954)లను అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో అభినందించినట్లు ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు



విద్యార్థినులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థినులు ఆడారి లక్ష్మీ గణేష్, బుదిరెడ్డి రేణుక, టెక్కలి భాగ్యశ్రీలను శనివారం సాయంత్రం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శాలువాలతో సత్కరించి నగదు బహుమతి అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, తద్వారా మంచి శిక్షణ అందుతుందన్నారు. పది తర్వాత లక్ష్యాన్ని సాధించేందుకు ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, పెద్దలు దాసరి అప్పారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి రమణబాబు పాల్గొన్నారు.